క్లుప్తంగా

చురుగ్గా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని అరసబలగలో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్ కొరగంజి సాయిరాం గురువారం జరిగిన పనులను పర్యవేక్షించారు. కాలువల్లో మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.

మండల సమావేశం రేపు

బాడంగి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పాఠశాల పరిశీలన



విద్యార్థుల విద్యాప్రమాణాలు తెలుసుకుంటున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. మండల పరిధిలోని శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు, నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జీవామృతం తయారీపై అవగాహన



జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సింహాద్రినాయుడు

వంగర: జీవామృతం వినియోగంతో నాణ్యమైన దిగుబడులు వస్తాయని మరువాడ యూనిట్ ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండల పరిధిలోని కింజంగిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించి, జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వి.పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

వంగర: మండల పరిధి వీవీఆర్‌పేటలో పాడైన తాగునీటి బోర్లకు గురువారం మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ బత్తిన గురువులు, ఎంపీటీసీ సభ్యుడు కాంతారావు ఆధ్వర్యంలో మెకానిక్ వెంకటరమణ మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తోటపల్లి కాలువలో ఉపాధి పనులు



బూరాడ వద్ద తోటపల్లి కాలువలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

రేగిడి: మండలంలోని బూరాడ, చిన్నశిర్లాం, కొర్లవలస, తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీటిని అందించే తోటపల్లి కాలువలో గురువారం ఉపాధి పనులు చేపట్టారు. ఈ పనులను ఏపీఓ ఎస్.హరనాథరావు పర్యవేక్షించారు. ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా పనులు చేపట్టనున్నట్లు ఏపీఓ తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ, మేట్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనపత్రాలను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక జీఎంఆర్ ఐటీ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి పలువురి వాహనదారుల నుంచి పెండింగ్ చలానాలు వసూలు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు లైసెన్స్ ధరించడంతో పాటు అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరిగితే సంబంధిత యజమానులే బాధ్యులని స్పష్టం చేశారు.

మన్యం వీరుడికి జోహార్లు..

మన్యం ప్రజల స్వేచ్ఛ కోసం ఆయుధం పట్టి బ్రిటీష్ దొరల గుండెలను గడగడలాడించి, తెలుగు జాతిని జాగృతం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు.. తన పోరాట పటిమతో అడవి నుంచి ఆకాశమంత ఎత్తుకు ఎదిగి ప్రజల కోసం నేలకొరిగిన ధీశాలి మన అల్లూరి. సాయుధ పోరాట యోధుడు, విప్లవ వీరుడి తెగువ యువత ఆదర్శం . అటువంటి మహానుభావుడి జయంతి వాడవాడలా గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి జోహార్ అల్లూరి అంటూ నినదించారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



బొబ్బిలి: మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాలకవర్గ సభ్యులు, అధికారులు



బొబ్బిలి రూరల్: అలజంగిలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీజీఎం హెచ్‌ఎం కృష్ణదాసు, తదితరులు



తెర్లాం : ఎంపీడీఓ కార్యాలయం వద్ద అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ మధుసూదనరావు, తదితరులు



రేగిడి : వండానపేట పాఠశాలలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం, తదితరులు



రామభద్రపురం: ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ, సిబ్బంది



మెంటాడ: ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ తదితరులు



సంతకవిటి: అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం వెంకటరమణ, తదితరులు



రాజాం : పెనుబాకలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మధుసూదనరావు, తదితరులు



వంగర: అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, సిబ్బంది.



రాజాం సిటీ: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు



బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు, తదితరులు

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

● విద్యార్థి సంఘాలు



బొబ్బిలి: నిరసన ప్రదర్శనలో విద్యార్థులు



రామభద్రపురం: విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు

బొబ్బిలి: నీట్ పరీక్షల పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. జాతీయ విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బి. కిరణ్, కె. మణికుమార్, శ్రావణ్, భరత్, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ర్యాలీ

రామభద్రపురం: నీట్ పరీక్ష పత్రం లీకేజీకి నిరసనగా భారత స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యులు మండలంలోని పలు పాఠశాలలను మూసి వేయించి బంద్ పాటించారు. అలాగే స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. లీకేజీ బాధ్యులను అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు నేరం



ఏపీ పురంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ

రేగిడి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీపీ దార అప్పలనరసమ్మ, ఉనుకూరు, బూరాడ సెక్టార్ల సూపర్‌వైజర్ నూకాలమ్మ అన్నారు. మండలంలోని ఏపీ పురం, ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో మహిళా జాగృతికి సంబంధించి బాల్య వివాహాలు, సామాజిక సమస్యలపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల అమ్మాయిలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అలాగే మాతా,శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. పురుషులకు 21 సంవత్సరాలు, మహిళలకు 18 సంవత్సరాలు దాటిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చుక్క వెంకటనాయుడు, అప్పయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు సామాజిక ప్రజా వేదిక

వంగర: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండల స్థాయి సామాజిక ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీఓ మద్రాపు సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజులుగా ఎనిమిది మంది డీఆర్‌పీల బృందం గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో జరిగిన వివిధ రకాల పనులపై గ్రామస్థాయిలో ఆడిట్ చేసి గ్రామ సభలు నిర్వహించారని పేర్కొన్నారు. ప్రజావేదికకు ఉన్నతాధికారులు హాజరవుతారని, ఉపాధిహామీ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: పర్యావరణానికి పెనుముప్పుగా దాపురించిన ప్లాస్టిక్‌ను నిరోధించి పర్యావరణాన్ని కాపాడాలని వికాసతరంగిణి సభ్యులు కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, దుకాణాల్లో నిషేధిత పాలిథిన్ కవర్లు, కప్పులు విక్రయిస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాలిథిన్, ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలను నిషేధించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వికాసతరంగిణి సభ్యులు టీటీవీ రమణమూర్తి, వాకచర్ల పైడిరాజు, తదితరులున్నారు.

సాగుహక్కు పత్రాలు కలిగి ఉండాలి

● ఏఓ శిరీష



గొల్లాది కౌలురైతుల సదస్సులో మాట్లాడుతున్న ఏఓ శిరీష

బాడంగి: మండలంలోని కౌలు రైతులందరూ విధిగా సాగు హక్కుపత్రాలు కలిగి ఉండాలని ఏఓ శిరీష అన్నారు. మండలంలోని గొల్లాది, గజరాయునివలస, కోడూరు గ్రామాలలో కౌలురైతుల గుర్తింపు సమావేశాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తహసీల్దార్ ఎస్.రాజారావుతో కలిసి మాట్లాడుతూ, కౌలురైతులందరికీ వీఆర్‌ఓల ద్వారా గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. పాతవారు సీసీఆర్‌సీ పత్రాలను రెన్యువల్ చేసుకోవాలని, కొత్తవారికి అర్హత బట్టి మంజూరు చేస్తామని తెలిపారు. ఈ పత్రాలతో భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. గ్రామ సభలలో సర్పంచ్‌లు బేతనపల్లి కిరణ్‌కుమారి, మూడడ్ల సత్తిబాబు, భోగి జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపు

వంగర: గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులను గుర్తిస్తున్నట్లు ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. మండల పరిధిలోని తలగాం, రాజులగుమ్మడ, వీవీఆర్‌పేట గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు రైతుల గుర్తింపునకు కావాల్సిన అర్హతలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఏఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌలురైతులను గుర్తిస్తున్నాం..

బొబ్బిలిరూరల్: మండలంలోని కౌలు రైతులను గుర్తించి సాగుహక్కు పత్రాలు అందిస్తున్నామని ఏఓ ఎం. శ్యామ్‌సుందర్ తెలిపారు. మండలంలోని మెట్టవలసలో కౌలురైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 10వ తేదీ వరకు కౌలురైతులను గుర్తించేందుకు గ్రామాల్లో సభలు నిర్వహించి, వీఆర్‌ఓల ద్వారా గుర్తింపు కార్డులు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో వీఆర్‌ఓ భాను, వీఏఏ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామానికి చెందిన ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరస్పర కేసులు నమోదు చేశామని సీఐ డి.మోహనరావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు మేరకు.. ఈ నెల 2న పొగిరి గ్రామానికి చెందిన లోలుగు సూర్యనారాయణ పొలంలో వేసిన మొక్కజొన్న మొక్కలను అదే గ్రామానికి చెందిన లోలుగు శంకరరావుతో పాటు మరో ఇద్దరు ధ్వంసం చేశారు. ఈ విషయమై అడిగితే తనపై దాడి చేశారని సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే లోలుగు సూర్యనారాయణ దౌర్జన్యంగా తమకు చెందిన భూమిని పది సెంట్లు మేర ఆక్రమించుకున్నాడని, ఈ విషయమై అడిగితే తనతో పాటు తల్లిని తిట్టడం, కొట్టడంతో పాటు చంపుతామని బెదిరించినట్లు శంకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే బేబినాయన (ఆర్‌వీఎస్‌కేకే రంగారావు) గురువారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గుణపూరు పురుషోత్తమరావు, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, ఎంపీడీఓ పి. రవికుమార్, ఎంఈఓ చల్లా లక్ష్మణరావు, వాసు లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి



సంకిలిలో మాదకద్రవ్యాల నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు, తదితరులు

రేగిడి: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఇ. శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చదువుపై దృష్టి సారించాలన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన



కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు

రాజాం: స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మకాలనీ, సారథి, హరిజనవీధి, తదితర వార్డుల్లో అర్బన్ పీహెచ్‌సీలకు చెందిన ఏఎన్‌ఎంలు, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అలాగే శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. ప్రసాద్ పర్యవేక్షణలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పలు వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్లు జల్లడంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేశారు.

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

● ఆర్డీఓ సాయిశ్రీ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ, జంతు సంక్షేమ కమిటీ సభ్యులు

బొబ్బిలి : పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇతర జిల్లాల నుంచే కాకుండా డివిజన్ పరిధిలోని పెదమానాపురం సంత నుంచి కూడా పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని చెప్పారు. వాటిని అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దేవాలయాలకు 300 మీటర్ల దూరంలో జంతు బలులు జరుగకూడదని స్పష్టం చేశారు. ఏపీ గో సంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ.. పశువులను సంరక్షించేందుకు ప్రతి మండలంలో ఓ గోశాల మంజూరుతో పాటు స్థలం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అన్ని మండలాల్లో జంతు సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యులందరితో కలసి ఆర్డీఓ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వాణిశ్రీ, బొబ్బిలి పశు సంవర్ధక శాఖ ఎ.డి కె. నీలయ్య, డిప్యూటీ ఈఓ కె.మోహనరావు, తహసీల్దార్ వి. త్రినాథరావునాయుడు, ఎస్సై జి.లోవరాజు, మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ సోమేశ్వరరావు, ఏపీ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బోర్ల రాజకుమారి, కార్యదర్శి నీలావు దేవి, సోము వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న విజయగౌరి

బొబ్బిలి: విద్యారంగ సమస్యలను పరిష్కరించే దిశగా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె. విజయగౌరి కోరారు. గురువారం స్థానిక తాండ్ర పాపారాయ మున్సిపల్ స్కూల్‌లో యూటీఎఫ్ బొబ్బిలి డివిజన్ సమావేశం నిర్వహించారు. జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలపై ప్రస్తావించారు. అలాగే డిసెంబర్‌లో కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ మహాసభల విజయవంతానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కేశవరావు, శ్రీనివాసరావు, వెంకటరావు, నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు



కౌలురైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ చంద్రరావు

రాజాం: మండలంలో అర్హులైన రైతులందరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులు అందిస్తామని వ్యవసాయశాఖ ఏడీఏ కె. చంద్రరావు అన్నారు. అంతకాపల్లి రైతు సేవాకేంద్రం వద్ద కౌలు రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 10 వరకు కౌలురైతుల గుర్తింపుతో పాటు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్) అందజేస్తామని వివరించారు. కౌలు రైతులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తొమ్మిది నెలల పాటు ఈ గుర్తింపు కార్డులు వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఓ రేనుకాసాయి, వీఆర్‌ఓ గెద్దాపు అనంతరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

● మండల విద్యాశాఖాధికారులు



పెరుమాళి హైస్కూల్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం:

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న పీఎం పోషణ గోరుముద్ద పథకంలో భాగంగా వండే వంటల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల విద్యాశాఖాధికారులు జె.త్రినాథరావు, ఆర్.పాపారావు అన్నారు. మండలంలోని పెరుమాళి జెడ్పీ హైస్కూల్, అరసబలగ ప్రాథమిక పాఠశాలలను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అలాగే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, చేతి రాతను, హోంవర్క్ పుస్తకాలు, మరుగుదొడ్లు, తాగు నీరు సరఫరా, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని బాలకవివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు వండిన వంటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శాసపు హైమావతి, ఉపాధ్యాయులు గణపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.